సాక్షి
చిత్తూరు
బుధవారం । 21 । ఆగస్టు । 2024



రోగాల బారిన 'కుప్పం'

కుప్పం పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. మురుగు నిల్వ చేరడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. - 8లో



కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కాణిపాకం వరసిద్ధుని బ్రహ్మోత్సవాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఈఓ శ్రీవాణి ఆహ్వానించారు. - 8లో



సమస్యల పరిష్కారానికి వినతి

టీచర్ల సర్దుబాటులో తలెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఎస్‌టీయూ నేతలు కోరారు. ఈ మేరకు డీఈఓకు విన్నవించారు. - 8లో

న్యూస్‌రీల్

'చెత్త నుంచి సంపద'తో ఆదాయం



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జేమ్స్, మహేష్‌బాబు

పాలసముద్రం : చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని ఎఫ్‌టీసీ, డీపీఆర్ జేమ్స్ తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబుతో కలిసి చెత్త సేకరణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డీపీఓ ఆదేశాల మేరకు చెత్త సేకరణపై మూడు రోజులుగా సర్వే నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రీన్ అంబాసిడర్లు సక్రమంగా చెత్త సేకరిస్తే గ్రామాలు పరిశుభ్రంగా తయారవుతాయన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఈ చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, అందులో వానపాములు వదలాలని చెప్పారు. అనంతరం సిద్ధమైన ఎరువును కేజీల లెక్కన ధర నిర్ణయించి రైతులకు విక్రయించాలని తెలిపారు. తద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని వెల్లడించారు.

పశు సంరక్షణపై అప్రమత్తం



దూడలకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

బంగారుపాళెం : పశు సంరక్షణపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని సంక్రాంతిపల్లె పశువైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను వేయించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ప్రతి ఆరు నెలలకు ఒకసారి 32 విడతలుగా టీకాలు వేయించినట్లు వెల్లడించారు. 33వ విడత వ్యాక్సినేషన్‌ను సెప్టెంబర్ 18వ తేదీ వరకు కొనసాగించనున్నట్లు వివరించారు. అలాగే 4 నుంచి 8 నెలల పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, చిత్తూరు డివిజన్ ఉపసంచాలకుడు ఆరిఫ్, పాలీ క్లినిక్ డీడీ సుబ్బమ్మ, ఏడీ ఆసిఫ్, నలగాంపల్లె పశువైద్యశాల డాక్టర్ జాన్సీ, సంక్రాంతిపల్లె జేవీఓ నాగేంద్రనాయక్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేశంలో మహిళలకు రక్షణ కరువైందని నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కరణం విమల మండిపడ్డారు. మంగళవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు.

24న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో ఈ నెల 24వ తేదీన ఉదయం 6.30 గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 16, 18, 20, 23 బాలబలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల జరగబోయే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వయసు, జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 86868 67078, 96420 09767నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్‌జీటీల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరపాలక పాఠశాలల్లో పనిచేసే ఎస్‌జీటీల ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. మంగళవారం నగరంలోని డీఈఓ కార్యాలయంలో సీనియారిటీ జాబితా ప్రకారం ధ్రువీకరణపత్రాలను పరిశీలించారు. ఈ మేరకు ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నారు.

హెల్త్ లాస్

- చిత్తూరుకు చెందిన షర్మిల వెన్ను నొప్పితో బాధపడేది. బరువు పెరగడం వల్లే ఈ సమస్య తలెత్తిందని చెప్పడంతో మేలో వెయిట్‌లాస్ సెంటర్‌ను ఆశ్రయించింది. నెల రోజుల్లో ఈ రెండు సమస్యలను పరిష్కరిస్తామని సెంటర్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. ఇందుకోసం తొలుత రూ.7,500, రెండో విడతగా రూ.7,500 వసూలు చేశారు. మళ్లీ మోకాళ్ల నొప్పిని కూడా తగ్గిస్తామని మరో రూ.3 వేలు గుంజుకున్నారు. తీరా బరువు తగ్గడం పక్కన పెడితే నొప్పులు మరింత పెరిగాయి. దీంతో షర్మిల సెంటర్‌లో గొడవకు దిగింది. ఎక్కడ ఫిర్యాదు చేసినా తమను ఏమీ చేయలేరని నిర్వాహకులు బెదిరింపులకు దిగడంతో ఆమె దిక్కు తోచక మిన్నకుండిపోయింది.

- తిరుపతికి చెందిన కృష్ణవేణి బరువు తగ్గాలని స్థానికంగా ఉన్న వెయిట్‌లాస్ సెంటర్‌కు వెళ్లింది. కేంద్రం నిర్వాహకులు ఆమెను మాటలతోనే బుట్టలో పడేశారు. దీంతో వారు చెప్పిన మేరకు తొలుత రూ.7 వేలు, ఆ తర్వాత మూడు నెలల కాలానికి రూ.35 వేలను ఫీజు చెల్లించారు. తీరా బరువు తగ్గినట్టే తగ్గి మరింత లావైపోయింది. చివరకు మోసం చేశారని తెలుసుకుని సెంటర్ నిర్వాహకులను నిలదీసింది. చెల్లించిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని పట్టుబట్టినా ప్రయోజనం లేకుండా పోయింది.

ఇవి మచ్చుకు రెండు మాత్రమే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇలాంటి కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇబ్బడిముబ్బడిగా వెలసిన వెయిట్ లాస్ సెంటర్లు బరువు తగ్గిస్తామంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తూనే ఉన్నాయి.



రెండు జిల్లాల వ్యాప్తంగా...

ఇటీవల చిత్తూరు, తిరుపతిలో వెయిట్‌లాస్, బాడీ పెయిన్స్, దీర్ఘకాలిక నివారణ, హెయిర్ గ్రోత్ సెంటర్లు అధిక సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఆయుష్ (ఆయుర్వేదం, యోగ, సిద్ధ, యునానీ, హోమియోపతి), అల్లోపతి పద్ధతిలో ట్రీట్‌మెంట్ చేస్తామని, కొన్ని రోజుల్లోనే అద్భుతమైన ఫలితాలు తథ్యమంటూ ఈ సెంటర్లు ఊదరగొడుతున్నాయి. ప్యాకేజీలతో ఎర వేసి ప్రజలను ఇట్టే ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి సెంటర్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 215 దాకా ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. చిత్తూరు జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరి, వి.కోట, తిరుపతి జిల్లాలో పుత్తూరు, తిరుపతిలోని వీవీ మహల్ రోడ్డు, కపిలతీర్థం రోడ్డు, ఎయిర్ బైపాస్ రోడ్డు, ముత్యాలరెడ్డిపల్లె, కరకంబాడి రోడ్డు, భవానీ నగర్, సూళ్లూరుపేట, రేణిగుంట, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లోని సెంటర్ల ద్వారా సుమారు 50 వేల మందికిపైగా చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో మహిళలే 35వేలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



సమాజంలో ఊబకాయం సమస్య ఎక్కువమందిని వేధిస్తోంది. మారిన జీవనశైలి కారణంగా శరీర బరువు విపరీతంగా పెరిగిపోతోంది. ఇదే అదునుగా వెయిట్ లాస్.. వెల్‌నెస్ పేరుతో కొన్ని సెంటర్లు పుట్టుకొచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో బరువు తగ్గిస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అల్లోపతి.. ఆయుర్వేదమంటూ మాయమాటలు చెప్పి ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా సైజ్ జీరో ఆశపెట్టి మహిళలనే అధికంగా బుట్టలో వేసుకుంటున్నాయి. బాధితుల బలహీనతను ఆసరాగా తీసుకుని భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. తీరా చికిత్స వికటించి దీర్ఘకాలిక ఇబ్బందులు తలెత్తితే మాకేం సంబంధంలేదంటూ చేతులు దులిపేసుకుంటున్నాయి. దీంతో బరువు తగ్గడం సంగతి దేముడెరుగు.. పేషెంట్లను లేనిపోని కొత్త సమస్యల్లో పడేస్తున్నాయి.

కాణిపాకం: ఊబకాయం కారణంగా వివిధ రకాల నొప్పులు పుట్టుకొస్తున్నాయి. తలనొప్పి, కండరాల, మోకాళ్ల నొప్పులు, ప్రసవం, మానసిక ఒత్తిడి, విటమిన్స్ లోపం తదితర సాధారణ సమస్యలను కూడా చాలా మంది పెద్ద జబ్బులుగా భావిస్తున్నారు. మారిన ఆహారపు అలవాట్లు, ఊబకాయంతోనే జనం దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని అధిగమించేందుకు ఈమధ్య కాలంలో చాలా మంది ఖర్చుకు వెనుకాడడం లేదు. తక్కువ కాలంలోనే బరువు, నొప్పులు, ఇతరత్రా సమస్యలు తగ్గిపోవాలనే వారి ఆరాటాన్ని వెయిట్‌లాస్ సెంటర్లు సొమ్ము చేసుకుంటున్నాయి. పుట్టగొడుగుల్లా ఇవి వెలుస్తున్నాయి.

జోరుగా ప్రకటనలు

పంచకర్మ చికిత్సల్లో భాగంగా స్నేహకర్మ, నదిస్వేదం, పిండిస్వేదం, కతివస్తి, జనువస్తి, నాశ్యకర్మ, శిరోధార, డిటాక్స్ థెరపీ, బరువు నియంత్రణ, మానసిక ఒత్తిడి, బాడీ మసాజ్, మైగ్రేన్..సమస్యలకు ట్రీట్‌మెంట్‌తో పాటు ప్రకృతి వైద్యం పేరిట జనరల్ మసాజ్, స్టీమ్‌బాత్, డైట్ కౌన్సెలింగ్, కోల్డ్ బ్లాంకెట్ ప్యాక్, తల కండరాలు, నడుం, భుజాలు, మోకాళ్ల నొప్పులకు చికిత్స చేస్తుంటారు. ఆక్యుపంక్చర్, యోగా.. వంటి సేవల పేరుతో కూడా జోరుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఇదే మాదిరి అల్లోపతిలో కూడా చేస్తామని సెంటర్లు ప్రచారం చేస్తున్నారు. అయితే వాటితో కొంతమందికి తాత్కాలికంగా లావు, నొప్పులు తగ్గినా మళ్లీ యథావిధిగా బరువు పెరగడం, నొప్పులు రావడం పరిపాటి మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీజుల వివరాలు

రోజులను బట్టి.. ప్యాకేజీలుంటాయి. 14 రోజులకు చికిత్స తీసుకుంటే రూ.599 నుంచి రూ.9,999 వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలురకాల శారీరక నొప్పులు, ప్రసవం, ఊపిరితిత్తుల సమస్యలు, బరువు, జుత్తు ఊడటం.. వంటి సమస్యలకు పౌడర్, ఆయిల్ ఇస్తున్నారు. అలాగే 40 రోజులపాటు నేరుగా చికిత్స తీసుకుంటే రూ.7 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. అయితే తాము ట్రీట్‌మెంట్‌కు ఎంచుకున్న కోర్సు కాలం పూర్తయినా సమస్యలు తీరడం లేదని, ప్యాకేజీల పేరుతో మోసం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. వాస్తవానికి చాలావరకు ఈ సెంటర్లను రిజిస్ట్రేషన్లు లేకుండా నిర్వహిస్తుండటం గమనార్హం. వీటిపై పర్యవేక్షణ అంటూ నిర్దిష్టంగా లేకపోవడమే ఈ సెంటర్ల పంట పండిస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్స్, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లను తనిఖీ చేసే అధికారులు వీటి మీద మాత్రం దృష్టి సారించడం లేదు. అసలు అక్కడ చేస్తున్నది సరైన ట్రీట్‌మెంటేనా? వైద్య ప్రమాణాలకు లోబడి చేస్తున్నారా? లేదా? సొంత విధానాలతో చేస్తున్నారా? అని ఇప్పటివరకు పరిశీలించిన దాఖలాలు లేవు.

ఆన్‌లైన్, వాట్సాప్ గ్రూపుల్లోనూ వ్యాపారం

నేరుగా ఇచ్చే చికిత్సే ఈ విధంగా ఉంటే.. ఆన్‌లైన్‌లో ఇచ్చే చికిత్సకు అడ్రస్ అనే మాటే లేదు..కానీ డబ్బులు మాత్రం దండుకునేస్తారు. ఇట్టే బుట్టలో పడేసేలా ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి జనం వాటిని నమ్మి చేతులు కాల్చుకుంటున్నారు. డబ్బులు చెల్లిస్తే..ఇంటికే కొన్ని రకాల పొడర్లు పంపిస్తూ.. జనాన్ని మోసగిస్తున్నట్లు ఆన్‌లైన్ బాధితులు వాపోతున్నారు. ఇక దీనికితోడు వాట్సాప్ గ్రూపుల్లోనే కొన్ని సెంటర్లు నడుస్తున్నాయి. రూ.600 నుంచి రూ.2వేల వరకు కడితే ప్రతిరోజూ గంట పాటు సలహాలు-సూచనలు ఇస్తుంటారు. వీటిలో అధికంగా మహిళలే మోసపోతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా వివాహమై సంతానలేమితో బాధపడుతున్న వారు కూడా ఇలాంటి వాటిని ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్యాకేజీలతో దోపిడీ

చాలా చోట్ల వెల్‌నెస్ సెంటర్లు ప్రజలను ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తూ, దేశీయ వైద్యమంటూ అందినకాడికి దోచేస్తున్నాయి. తీసుకున్న ప్యాకేజీని పక్కన పడేస్తున్నాయి. సెంటర్లో అవి చేస్తాం..ఇవి చేస్తామని..చివరకు జీరో సైజు కాదు.. జేబులను జీరో చేస్తున్నాయి. దీంతో బరువు తగ్గకపోగా నొప్పులతో అవస్థలు పడుతున్నారు. ఇందులో ఉద్యోగులే అధిక సంఖ్యలో ఉండడం విశేషం. వీరంతా చెప్పుకుంటే అవమానంగా భావించి చాలావరకు మిన్నకుండిపోతున్నారు.



మోసపోయాం



లావు తగ్గాలని ఓ సెంటర్‌కు వెళ్లా. వాళ్లకు పెద్ద సిటీల్లో బ్రాంచెస్ ఉన్నాయంటే చేరా. మొదట్లో రూ.7,500 కట్టాను. మళ్లీ డబ్బులు కట్టామంటే రూ.7,500 చెల్లించా. లావు తగ్గలేదు... నొప్పులూ వదల్లేదు. నొప్పులు తగ్గలేదని ప్రశ్నిస్తే ఏవేవో సాకులు చెబుతున్నారు. రోజూ రావాలని మాత్రం చెబుతున్నారు. వారు మాత్రం వారంలో ఒక్కరోజు తెరుస్తారు. మళ్లీ తాళం వేస్తారు. అక్కడ పనిచేసే అమ్మాయికి జ్వరం, ఇంటి సమస్యలంటూ వెళ్లిపోతోంది. నేను వెళ్లి నా డబ్బులు తిరిగి ఇచ్చేయండి అని అడిగాను. ఇలా చాలా మంది వచ్చి ఆ సెంటర్లో గొడవలకు వస్తున్నారు. నమ్మి మోసపోయాం.

– మంజులాదేవి, చిత్తూరు

ఫిర్యాదులు వస్తున్నాయి



దేశీయ వైద్యం మంచిదే. కానీ ఆ వైద్యాన్ని పక్కాగా అందించే వారి వద్దకు వెళితే ఉత్తమం. ప్రస్తుత కాలంలో చాలా చోట్ల దేశీయ వైద్యం అంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అలాంటి వాటిజోలికి వెళ్లొద్దు. లావు తగ్గడంతోపాటు మరిన్ని రోగాలను కొని తెచ్చుకోవాల్సి వస్తుంది. ప్రధానంగా కిడ్నీలపై ఎఫెక్ట్ పడుతుంది. బీపీ, మధుమేహం వంటి వ్యాధులు కూడా వస్తాయి. మరింత లావైపోతారు. లేనిపోని నొప్పులు వస్తాయి. ఆయుష్‌లో ప్రభుత్వ వైద్యులు ఉన్నారు. వారి సలహాలు కూడా తీసుకోవచ్చు.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

రిజిస్ట్రేషన్ లేకుంటే నేరం



ఇంజక్షన్లు ఇచ్చే ప్రతి వైద్యానికి కూడా కచ్చితంగా రిజిస్ట్రేషన్ ఉండాలి. రిజిస్ట్రేషన్ లేకుండా చికిత్స చేయడం నేరం. ఏపీ ఎంసీఈ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. బరువు తగ్గడం కోసం పలు రకాల మందులు వాడుతున్నారు. వాటిలో కొన్ని మందులు మనిషినే హరిస్తాయి. వాడినంత వరకు బాగానే ఉంటాయి. మళ్లీ మరింత బరువును తెచ్చిపెడుతోంది. గుండె నొప్పులు కూడా మొదలవుతాయి. మంచి వైద్యుడి దగ్గర దేశీయ వైద్యం చేయించుకుంటే ఆరోగ్యపరంగా ఇబ్బందులుండవు.

– శ్రీహరి, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

జెడ్పీలో బదిలీలలు!

- ముమ్మరంగా కసరత్తు చేస్తున్న అధికారులు
- జాబితా తయారీకి సన్నాహాలు
- ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఉద్యోగులు
- ప్రాధాన్యతా పోస్టుల కోసం ప్రయత్నాలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ పరిధిలో బదిలీలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు జాబితా తయారీకి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే ప్రాధాన్యతా పోస్టుల కోసం పలువురు ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి నేతలను ప్రసన్నం చేసుకునేందుకు మంతనాలు సాగిస్తున్నారు. ఇందులో ఐదేళ్ల సర్వీసు పూర్తి కాని వారు కూడా ఉండడం గమనార్హం.

మండల పరిషత్‌లో..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 65 మండలాలు ఉండగా, 48 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు ఉన్నారు. అందులో పుత్తూరు ఎంపీడీఓ ఇందిరమ్మ ఒకే ప్రాంతంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు.

పంచాయతీరాజ్‌శాఖలో

పీఆర్‌లో మొత్తం 7 మంది డీఈలకు గాను ఇద్దరు, 14 మంది ఏఈలకు గాను 8 మందికి ఐదేళ్ల సర్వీసు పూర్తయ్యింది. అలాగే జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలో 585 మంది కార్యదర్శులు పని చేస్తున్నారు. అందులో 70మంది ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో..

జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ పరంగా మొత్తం 10 డీఈలకు ఇద్దరు, 41 మంది ఏఈలకు గాను 10 మందికి బదిలీ తప్పదని తెలుస్తోంది. వీరు కాకుండా జెడ్పీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో జూనియర్,సీనియర్ సహాయకులు కలిపి 150 మంది వరకు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయం

కసరత్తు చేస్తున్నాం

ఉమ్మడి జిల్లాలో జెడ్పీ పరిధిలోని ఒక ఎంపీడీఓ, 150 మంది, జూనియర్, సీనియర్ సహాయకులు బదిలీలకు అర్హులుగా ఉన్నారు. దీనికి సంబంధించిన జాబితా తయారీకి కసరత్తు చేస్తున్నాం. ఐదేళ్ల సర్వీసు పూర్తి ప్రాతిపదికనే సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే బదిలీలు ఉంటాయి.

– గ్లోరియా, జెడ్పీ సీఈఓ

వర్షం కోసం వలస



పెనుమూరు మండలం చిప్పారపల్లె పంచాయతీలో మంగళవారం సాయంత్రం గ్రామస్తులు అడవికి వలసపోయారు. వర్షం కురిపించాలని వేడుకుంటూ అటవీప్రాంతంలోని మల గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఆనవాయితీగా చేపట్టే వలస బాటలో పరిసర గ్రామాల ప్రజలు కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, మాజీ సీఈఓ కారేటి కృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి, సురేష్ రెడ్డి, పాపిరెడ్డి, జయచంద్రారెడ్డి, త్యాగరాజులు రెడ్డి, శ్రీరాములు, మునిరత్నం, ఢిల్లీనాయుడు, తులసినాయుడు, వాసుదేవనాయుడు, వీరభద్ర, గజేంద్రం, శ్రీనివాసులు, నాథమునినాయుడు, రామానాయుడు పాల్గొన్నారు.

– కార్వేటినగరం(పెనుమూరు)

సెక్టోరల్ అధికారులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సమగ్రశిక్ష కార్యాలయాలల్లోని సెక్టోరల్ అధికారులకు ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. విపత్తులు, అత్యవసర సమయాల్లో విద్యను అందించడంపై సెప్టెంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు కృష్ణా జిల్లాలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం నుంచి ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ నరోత్తమరెడ్డి, తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష శాఖ నుంచి ఏఎల్‌ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్‌లను ఎంపిక చేశారు.

'పక్కా'గా మౌలిక వసతులు

కార్వేటినగరం: జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్లకు పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం పద్మ సరస్సు, పచ్చికాపల్లం రోడ్డులోని జగనన్న కాలనీలను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు డీఆర్‌డీఏ ద్వారా రూ.50వేల రుణం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీల్లో ఆగిన నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ఆర్కేవీబీపేట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు

ప్రభుత్వం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తోందని కలెక్టరవెల్లడించారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించుకోవాలని సూచించారు. అలాగే డ్రోన్‌లను వినియోగించుకుని మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రేణిగుంట షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని పలువురు రైతులు విన్నవించారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం రైతు నాగేశ్వరరాజు పొలంలో శ్రీగంధం మొక్క నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీడీఓ లక్ష్మీపతి, తహసీల్దార్ భగవతి, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, ఈఓ పీఎస్ మణి, సర్వేయర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పకడ్బందీగా పంటల మార్కెటింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రైతులు పండించే పంటలకు పకడ్బందీ మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థల బలోపేతానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెరుగైన నాణ్యమైన ఉత్పత్తులు సాధించేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. సన్న, చిన్నకారు రైతులు ఎఫ్‌పీఓ (ఫార్మర్స్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్స్)లో భాగస్వాములు కావాలన్నారు. ఆర్థిక బలంతోపాటు మార్కెట్ అనుసంధానం పెంపొందించుకోవడానికి ఎఫ్‌పీఓలు దోహదపడతాయని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), వివిధ సంస్థల ఆధ్వర్యంలో 17 ఎఫ్‌పీఓలు పనిచేస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేసే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో పాలు, కూరగాయలు, మామిడితో పాటు ఉద్యానవన పంటల మార్కెటింగ్‌పై ఎఫ్‌పీఓలు దృష్టి పెట్టాలన్నారు. కోల్డ్ స్టోరేజీలను పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు పెండింగ్ లేకుండా లైసెన్సులు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, నాబార్డ్ ఏజీఎం సునీల్‌కుమార్, వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల అధికారులు మురళీకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామి చిత్ర పటం అందుకుంటున్న వాణీమోహన్

కాణిపాకం:కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణీ మోహన్ సేవించుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆలయం వద్ద ఆమెకు ఈఓ కె.వాణి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీధర్ పాల్గొన్నారు.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : కాణిపాకంలో నిర్వహించే వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఈఓ శ్రీవాణి ఆహ్వానం అందించారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్‌కు తొలుత అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఈఓ వివరించారు. ఈ క్రమంలోనే కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటం బహూకరించారు.

నేడు భారత్ బంద్‌కు పిలుపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్‌లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని కోరుతూ భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు తెలిపారు. మంగళవారం చిత్తూరు నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు సమావేశమయ్యారు. రాబర్ట్, బాబు, రాజాబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఆస్తి నష్టం

శ్రీరంగరాజపురం : మండలంలోని రాఘవరాజపురంలో అంగన్‌వాడీ టీచర్ రెడ్డెమ్మ తన ఇంట్లో పాలు వేడి చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు ఎగసిపడ్డాయి.ఈ ప్రమాదంలో నిత్యావసర సరుకులు, బీరువాలోని చీరలు, రూ.75 వేల నగదు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీఓ మోహన్‌మురళి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోగాల బారిన కుప్పం



హెచ్‌పీ రోడ్డులోని డ్రైనేజీలో కదలని మురుగు

కుప్పం.. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కడా పేరుతో అభివృద్ధికి శ్రీకారం చుట్టామంటున్నారు. ప్రత్యేక అధికారిని నియమించామంటున్నారు. ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పట్టణాన్ని మురుగుకూపంలా మార్చేశారు. జనాలను రోగాల బారిన పడేశారు. పాలకులు పట్టించుకోకపోవడంతో డ్రైనేజీలు దోమల ఆవాసాలు మారిపోయాయి. దీంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరపీడితులతో ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి.

- పురపాలక పరధిలో పడకేసిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని పాలకవర్గం
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- పెరుగుతున్న జ్వర పీడితులు

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో మురుగు నీటి కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతుండడంతో పట్టణవాసులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. పెద్దసంఖ్యలో రోగాల బారిన పడుతున్నారు. పురపాలక పరధిలోని మొత్తం 25 వార్డుల్లోనూ పారిశుద్ధ్య నిర్వహణ తూతూమంత్రంగా ఉంది. దీంతో కుప్పం మురుగుకూపంలా మారిపోయింది.

కిక్కిరిసిన వంద పడక అస్పత్రి

పట్టణంలోని వంద పడకల ఆస్పత్రి కిక్కిరిసిపోతోంది. జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. అస్పత్రికి వస్తున్నా రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. వారంలోనే 34 మంది ఆస్పత్రిలో అడ్మిట్ కాగా, ఓపీ కింద నిత్యం వందమందికి పైగా చికిత్సలు పొందుతున్నారు. రక్తపరీక్షల్లో పలువురికి డెంగీ నిర్ధారణ కావడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళుతున్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సాధారణ జ్వరంగా చేరినవారికి సైతం గంటల వ్యవధిలోనే డెంగీ నిర్ధారణ అవుతోంది. దీంతో ఎక్కువమంది కుప్పం మెడికల్ కళాశాల, బెంగళూరు నగరాలకు మెరుగైన వైద్యం కోసం వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తోంది.



వంద పడకల అస్పత్రిలో జ్వర పీడితులు

తీవ్రంగా దోమల బెడద

పట్టణంలోని ఇళ్ల మధ్య చెత్తాచెదారం పేరుకుపోయింది. మున్సిపాలిటీ వారు పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా కాలువల్లో మురుగు నిల్వ చేరిపోయింది. ప్రధానంగా మోడల్ కాలనీ, అనిమిగానిపల్లె, హెచ్‌పీ రోడ్డు, విజయలక్ష్మీరోడ్డు , కొత్తపేట, ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్, డీకే పల్లి ప్రాంతాలు దారుణంగా మారిపోయాయి. కాలు మోపాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే కొత్తపేట, డీకే పల్లె రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగునీరు నిల్వ చేరినా పట్టించుకునే నాథుడే లేరు. ఎన్‌టీఆర్ కాలనీలో సైతం పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ఈ క్రమంలోనే పరమసముద్రం, ఎల్లాంజగానూరు, చీగలపల్లె, బండకొత్తూరు, సామగుట్టపల్లె , కమతమూరు, కత్తిమనుపల్లెలో సైతం పారిశుద్ధ్య పనులు చేపట్టినా దాఖలు లేవు.

23న కంప్యూటర్ టెస్ట్

చిత్తూరు కలెక్టరేట్ : ఐసీడీఎస్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీన కంప్యూటర్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ పరిధిలో వివిధ పోస్టులకు అర్హుల జాబితాను www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేశామన్నారు. జాబితాలో పేరు ఉన్నవారు ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే కంప్యూటర్ టెస్ట్‌కు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఓటరు కార్డు, పాన్‌కార్డు తీసుకురావాలని స్పష్టం చేశారు.

టీచర్లకు సర్దుబాటు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 31 మండలాల్లో మంగళవారం టీచర్ల సర్దుబాటు కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహించారు. పలు నిబంధనల మార్పుల వల్ల గందరగోళం ఏర్పడడంతో 22 మండలాల్లో మాత్రమే ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలిన మండలాల్లో బుధవారం కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. ప్రక్రియను డీఈఓ దేవరాజు, డీవైఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

జిలెటిన్ స్టిక్స్ కేసులో మరో నిందితుడి అరెస్ట్

చిత్తూరు అర్బన్: జిలెటిన్ స్టిక్స్‌తో సంచరిస్తున్న కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం శివాజీ (48) అనే మరో నిందితుడిని అరెస్టు చేశారు. న్యాయమూర్తి ఆదేశాలతో శివాజీని రిమాండుకు తరలించినట్లు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : మలేరియా ప్రబలకుండా విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి తెలిపారు. మంగళవారం నగరంలోని సంజయ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. మలేరియా నిర్మూలనకు వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఏటా ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ దోమ కాటుతో సోకే వ్యాధులను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సర్దుటులో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఈ మేరకు డీఈఓ దేవరాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులను ఎస్‌జీటీ ఖాళీల కింద అక్కడే కొనసాగించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్‌ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయిన తర్వాతనే ఎస్‌జీటీ, భాషాపండితుల సర్దుబాటు చేపట్టాలని కోరారు. డీఈఓ పూల్‌లో ఉన్న భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. టీచర్ల రెగ్యులరైజేషన్ జాబితాలను డీఎస్సీల వారీగా ర్యాంకులు, రోస్టర్ వివరాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు దేవరాజులురెడ్డి, గణపతి, చంద్రన్, కమలాపతి, భాషా పండితులు గోపి, స్వామినాథుడు పాల్గొన్నారు.

నీళ్లున్నా వదలం.. ఇసుక తరలిస్తాం



నదిలో నీటి పక్కనే ఇసుకలోడ్ చేసుకుంటున్న ట్రాక్టర్

నగరి: రీచ్ లేకున్నా.. వర్షం వచ్చినా.. నదిలో నీళ్లున్నా ఇసుక తరలింపు ఆగదు అంటూ అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు చేతులు ముడుచుకుని కూర్చున్నారు. దీంతో కుశస్థలి నదిలో కేవీపీఆర్ పేట వరకు ఇసుక కనుమరుగై ముళ్లచెట్లు దర్శనమిస్తున్నాయి. తెరణి ప్రాంతంలో ఉన్న ఇసుకను కూడా దాదాపు తరలించేశారు. నదిలో నీరు పారుతున్నా అక్రమార్కులు మాత్రం ఇసుకను తరలించేస్తున్నారు. శ్మశానాలను కూడా వదలకుండా ఇసుకను తోడేస్తుంటే వ్యవసాయ బోర్లలో నీరు ఇంకిపోతోందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

2 వరకు అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : స్కావెంజింగ్ ఫ్రీగా జిల్లాను ప్రకటించామని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 2వ తేదీలోపు తెలియజేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్ శానిటరీ మరుగుదొడ్ల వివరాలపై సర్వే నిర్వహించామని వెల్లడించారు. ఈ మేరక వచ్చిన నివేదికలు ఆధారంగా జిల్లాను స్కావెంజింగ్ ఫ్రీగా ప్రకటించినట్లు వివరించారు. అభ్యంతరం ఉన్నవారు మున్సిపాలిటీ, ఎంపీడీఓ ద్వారా జిల్లా షెడ్యూల్ కులాలు సంక్షేమ, సాధికారత కార్యాలయానికి పంపించాలని సూచించారు.

6 లోపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షకు సెప్టెంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీయూపీ, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో ఈ ఏడాది 8 వ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వెల్లడించారు. జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్‌సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.50 ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఎస్బీఐ కలెక్ట్ లింకులో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు డీఈఓ కార్యాలయంలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి



మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

ఐరాల: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం అధికారి లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం మండలంలోని ఐలవారిపల్లెలో ప్రకృతి వ్యవసాయం, భూ పరీక్షల ఆధారిత ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు ఆవశ్యకత, ప్రతికూల వాతవరణ పరిస్థితులలో ఆచరించవల్సిన పద్ధతులను వివరించారు. జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు ఉమ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యసాయం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, వీఏఏ రెడ్డెప్ప పాల్గొన్నారు.

జిల్లాకు 2.75 మెట్రిక్ టన్నుల చక్కెర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు 2.75 మెట్రిక్ టన్నుల చక్కెర చేరినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అంత్యోదయ కార్డుదారులకు కేజీ చక్కెర, మిగిలిన కార్డుదారులకు అర కేజీ చొప్పున పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రేషన్ షాపుల వారీగా చక్కెర సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా



మాట్లాడుతున్న ప్రసాద్

చిత్తూరు అర్బన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పది మందికి రూ.10వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు తెలిపారు. మంగళవారం నగరంలో వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం తాగి వాహనాలు నడిపేవారు పట్టుబడినట్టు వెల్లడించారు. గత 9 నెలల వ్యవధిలో 261 మందికి సుమారు రూ.19.9 లక్షల జరిమానా విధించామని వివరించారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యం

శ్రీరంగరాజపురం : సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సర్పంచ్‌లు అధిక ప్రాధాన్యమివ్వాలని శిక్షణ అబ్జర్వర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు సర్పంచ్‌లకు చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కల్పించారు. పంచాయతీ ఆదాయాన్ని మెరుగుపరుచుకుని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం



నగరి : పట్టణంలోని సత్రవాడ చెరువు సమీపంలో మంగళవారం సారా బట్టీపై దాడి చేసి 600 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. ఇకపై తరచూ ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ ఉంటామని సారా తయారీ దారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆవుల చోరీపై ఎట్టకేలకు కేసు

చిత్తూరు అర్బన్: నగరంలో వరుసగా ఆవులు చోరీకి గురవడంపై పోలీసుల ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. బాధితుల కథనం మేరకు.. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురం, కొంగారెడ్డిపల్లెకు చెందిన పద్మనాభం, తులసీకుమార్, ఇంద్రాణి, మైత్రి, మురళి, మహేంద్రబాబు, విజయకు ఆవులు ఉన్నాయి. గత వారం రోజులుగా వారి 8 ఆవులు కనిపించకుండా పోయాయి. ఆవులు చోరీకి గురైనట్లు అనుమానించిన బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఆవులు కనిపించకపోతే తామేమీ చేయలేమని పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో సోమవారం బాధితులంతా కలిసి కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వన్‌టౌన్ పోలీసులు సోమవారం ఓ కేసు, మంగళవారం రెండు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయరామయ్య తెలిపారు.

టీడీపీ నేతపై హత్యాయత్నం



దెబ్బతిన్న కారు (ఇన్‌సెట్) రఘుచంద్రగుప్త

బైరెడ్డిపల్లె : మండలంలోని లక్కనపల్లె గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రఘుచంద్రగుప్తపై హత్యాయత్నం జరిగింది. సోమవారం రాత్రి తమిళనాడులోని తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణ పూర్తి చేసుకుని ఆయన స్వగ్రామానికి కారులో బయలుదేరాడు. గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఎదురుగా వస్తున్న టెంపో ఢీకొంది. టీడీపీ నేత రఘుచంద్రగుప్త చాకచక్యంగా కారును పక్కకు తిప్పడంతో ప్రమాదం జరగలేదు. కారులో నుంచి రఘుచంద్రగుప్త కిందకు దిగడంతో మళ్లీ టెంపో వెనక్కు వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో భయాందోళనకు గురైన రఘుచంద్రగుప్త గట్టిగా అరచి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న సిమెంటు బ్రిక్స్ ఫ్యాక్టరీ నిర్వాహకులు అక్కడికి చేరుకున్నారు. దీంతో టెంపో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై ఆయన టీడీపీ నేతలకు తెలియజేసి పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు రాజకీయకక్షతో హత్యాయత్నానికి పాల్పడ్డారా? వ్యాపార లావాదేవీలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను సీఐ ప్రసాద్, ఎస్‌బీ సీఐ భాస్కర్ పరిశీలిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు సమీపంలో ఉన్న సంపల్లి క్రాస్ వద్ద మంగళవారం చేపట్టిన వాహనాల తనిఖీలో కర్ణాటక మద్యం పట్టుబడినట్టు ఎస్ఐ సహదేవి తెలిపారు. గంగవరం మండలం దండపల్లెకు చెందిన బి.మురళి, ఎస్.రమేష్ అనే నిందితులు ద్విచక్ర వాహనంలో 96 ప్యాకెట్ల కర్ణాటక మద్యం తీసుకు వస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

దుండగుడికి దేహశుద్ధి



గ్రామస్తుల అదుపులో నిందితుడు

శాంతిపురం : మూడేళ్ల చిన్నారిని అపహరించేందుకు యత్నించిన దుండగుడిని మహిళలు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని గుండిశెట్టిపల్లె అంబేడ్కర్ కాలనీలోకి మంగళవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించాడు. ఇంటి ముందు నిద్రిస్తున్న బాలిక(3)పై మత్తు మందు చల్లిన వెండి కాలి పట్టీలు, చేతి కడియాలు, మొలతాడు చోరీ చేశాడు. తర్వాత బాలిక చేతులు, కాళ్లు గుడ్డ పేలికలతో చుట్టి భుజాన వేసుకుని వెళుతుండగా బాలకి తల్లి గమనించి కేకలు వేసింది. దీంతో బాలికను అక్కడే పడేసి దుండగుడు పారిపోయాడు. నిందితుడి కోసం గాలించిన స్థానికులు కర్ణాటక సరిహద్దులోని మద్యం దుకాణం వద్ద పట్టుకుని గ్రామానికి తీసుకువచ్చారు. మహిళలు ఆ దుండగుడికి దేహశుద్ధి చేసి రాళ్లబూదుగూరు పోలీసులకు అప్పగించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు



మాట్లాడుతున్న ఏఓ బ్రహ్మయ్యచ్చారి

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్ఏఓ శ్రీనివాసులు, ఏఓ బ్రహ్మయ్యచ్చారి తెలిపారు. మంగళవారం ఈ మేరకు చిత్తూరు రూరల్, అర్బన్ కార్యాలయాల్లో వేర్వేరుగా ఈఈ, డీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ శాఖకు బకాయిలు భారం తగ్గే అవకాశం ఉందన్నారు. సంబంధిత కార్యాలయాల రీడింగ్‌ను ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని చెప్పారు. దశలవారీగా వీటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్పు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఈఈలు మునిచంద్ర, హరి, డీఈలు పద్మనాభశెట్టి, శేషాద్రి, జ్ఞానేశ్వర్, కొండయ్య పాల్గొన్నారు.